సాక్షి
అనంతపురం
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.32 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.2°/21.8°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీలో వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఉత్తమ టీచరు అవార్డులకు దరఖాస్తు చేసుకోండి



అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 5న జరిగే 'గురుపూజోత్సవం' రోజున జిల్లాస్థాయిలో అందజేసే 'ఉత్తమ టీచరు' అవార్డులకు అర్హులైన టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, ఏపీఎంఎస్, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీఆర్‌ఈఐఎస్, కేజీబీవీ స్కూళ్లు, డైట్ కళాశాలలో పని చేస్తున్న టీచర్లు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. దరఖాస్తులు (రెండుసెట్లు) ఈనెల 25 సాయంత్రం 5 గంటలలోపు ఎంఈఓ/డీవైఈఓకు అందజేయాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రిమార్కులతో 28 సాయంత్రం 5 గంటలలోపు ఎంఈఓ/డీవైఈఓలు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు.

దరఖాస్తుకు నిబంధనలివీ..

కనీసం పదేళ్లు బోధనానుభవం ఉండాలి. గతంలో జిల్లాస్థాయి అవార్డు తీసుకుని ఉండకూడదు. దరఖాస్తుదారునిపై ఎలాంటి క్రిమినల్ కేసులు/ఆర్టికల్ ఆఫ్ ఛార్జెస్/శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండకూడదు. మరిన్ని వివరాలకు డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో పరిశీలించాలని డీఈఓ తెలిపారు.

సేవాఘడ్ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం రూరల్: గొల్లలదొడ్డి (సేవాఘడ్) గిరిజన గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5,6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వసతితో పాటు ప్లేట్లు, గ్లాసులు, నోట్ పుస్తకాలు, దుస్తులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 98853 69079, 8978239363, 9550655840 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

దివ్యాంగులతో చెడుగుడు

అనంతపురం క్రైం: కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై ప్రతాపం చూపుతోంది. పూటకో నిబంధనలు మారుస్తూ వారితో చెడుగుడు ఆటుకుంటోంది. లేని పోని నిబంధనలను పెట్టి కార్యాలయాలు, ప్రభుత్వ వైద్యుల చుట్టూ తిప్పుతోంది. దివ్యాంగుల పింఛన్ల పంపిణీలో కొన్ని మార్పులు చేసినట్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేయడం గమనార్హం. 40% కంటే తక్కువ వైకల్యం ఉండి, 60 సంవత్సరాలు మించిన వారిని వృద్ధుల కేటగిరీలోకి మార్చి రూ.4 వేల పింఛనులోకి చేర్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. మానసిక వైకల్యం కలిగి ఉన్న 18 సంవత్సరాల వయసు లోపు పిల్లలకు యథావిధిగా పింఛను అందించనున్నట్లు స్పష్టం చేసింది. ఇకపోతే... పునఃపరిశీలనలో కొంతమంది దివ్యాంగులకు తాత్కాలిక సర్టిఫికెట్లు జారీ చేసి రద్దు నోటీసులు ఇచ్చారని, ఇలాంటి వారు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల వద్ద అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపింది. అప్పీల్ నోటీసుతో పాటు అప్పీల్ లెటర్, ఆధార్ కలిపి ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్‌కి అందించాలని సూచించింది. నోటీసు అందిన 30 రోజుల్లోపు అప్పీల్ చేసుకొనే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు.

గాడి తప్పిన పాలన

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెన్షన్ల కోతతో దివ్యాంగుల ఆర్తనాదాలు
- యూరియా దొరక్క రైతుల ఆందోళనలు
- తమ నాయకుణ్ని దుర్భాషలాడారని ఎన్టీఆర్ అభిమానుల ఆక్రోశం
- ఇళ్ల దగ్గరికి రేషన్ రావడం లేదంటూ వృద్ధుల కన్నీళ్లు
- భారీ దొంగతనాలతో పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- ఎమ్మెల్యేలు వేధిస్తున్నారంటూ ఉద్యోగుల ఆవేదన



యూరియా సరఫరాలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 20న అనంతపురంలో డీసీఎంఎస్ కార్యాలయానికి తాళాలు వేస్తున్న రైతులు



❐ ఈ అబ్బాయి పేరు గౌతమ్. వయసు 12 ఏళ్లు. అనంతపురం నగర పరిధిలోని శాంతినగర్‌లో నివాసముంటున్నారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో 100 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. ఇటీవల కూటమి ప్రభుత్వం చేయించిన రీ–వెరిఫికేషన్‌లో 40 శాతం వైకల్యం ఉన్నట్లు చూపడంతో పింఛను నిలిపివేశారు. దీంతో బాలుడి తల్లి శారద తీవ్ర ఆవేదన చెందుతోంది.



జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన దారుణ వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 17న నగరంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద బైఠాయించిన ఫ్యాన్స్

ఆందోళనలు.. ఆర్తనాదాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పాలనా పగ్గాలు చేపట్టిన రోజునుంచి ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడు ఏం జరుగుతుందో, ఏ ఎమ్మెల్యే నుంచి ఎలా ముప్పు ఉంటుందో అంచనా వేయలేని పరిస్థితి. పాలనా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని, ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. చంద్రబాబు సర్కారుపై గ్రామ గ్రామాన సామాన్యులు రగిలిపోతున్నారు. 14 నెలలు గడిచినా పాలన బాగుపడకపోగా రెవెన్యూ మొదలు పోలీసు వ్యవస్థ వరకూ నిర్వీర్యమయ్యాయని వివిధ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. కలెక్టరేట్‌కు వచ్చి సమస్యలు కలెక్టర్‌కు విన్నవించినా పరిష్కారం కావడం లేదు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూశాం.. ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ లేవన్న వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

దివ్యాంగుల కడుపుకొట్టి

తాము అధికారంలోకి వస్తే పెన్షన్ పెంచుతామన్న చంద్రబాబు.. ఇప్పుడు అంధులు, బధిరులు, దివ్యాంగులు ఆర్తనాదాలు పెట్టేలా చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9 వేల మందికి పైగా దివ్యాంగులకు పెన్షన్లు రాకుండా చేశారు. దీంతో జిల్లాలో ఎక్కడికక్కడ ప్రభుత్వ కార్యాలయాల వద్ద దివ్యాంగులు నిరసనలకు దిగుతున్నారు. మరోవైపు వృద్ధులు తమకు ఇంటివద్దకు రేషన్ రావడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు.



తమ జీవితాలతో ఆటలాడవద్దంటూ గురువారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి అనంతపురం కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన దివ్యాంగులు

రైతులకు యూరియా ఇవ్వలేకపోయారు..

ఉమ్మడి జిల్లాలోని చాలాచోట్ల ఇటీవల రైతులు వరి నాట్లు వేశారు. పంటకు యూరియా వేయడానికి ప్రస్తుతం సరైన సమయం. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడా బస్తా యూరియా కూడా లభించడం లేదు. యూరియా కోసం బారులు తీరుతున్న దుస్థితి నెలకొంది. రైతులు ఏకంగా ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసి నిరసనలు తెలుపుతున్నారంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. ఈ క్రమంలో 2014–19 రోజులు మళ్లీ గుర్తుకొస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మరోవైపు ఉద్యోగులు, అంగన్‌వాడీలు తీవ్ర అసహనంతో ఉన్నారు.

ప్రెస్‌మీట్ పెట్టే స్వేచ్ఛ కూడా లేదా..?

ఇటీవల అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై ఆయన అభిమానులు భగ్గుమన్నారు. నిరసనలకు దిగారు. కానీ జిల్లాలో ఎన్టీఆర్ అభిమానుల మీడియా సమావేశం ఏర్పాటుకు పోలీసులు నిరాకరించారు. దీంతో హైదరాబాద్‌లో పెట్టుకోవాల్సి వచ్చిందని వారు వాపోతున్నారు. ఇక.. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేను ఏడాదిగా పట్టణంలోకి రానివ్వకుండా చేయడంలో పోలీసులు రాజకీయ నాయకుల్లా వ్యవహరించారనే విమర్శలున్నాయి.

దొంగల సవాల్..

ఓవైపు భూకబ్జాలు, విచ్చలవిడి మద్యం అమ్మకాలు, మట్కా, గంజాయి తదితర వ్యవహారాలు యథావిధిగా జరుగుతున్నాయి. మరోవైపు దొంగలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. అనంతపురం శివారులో ఘటన, ఇటీవల హిందూపురంలో బ్యాంకు దోపిడీలు పోలీసుల ఉనికినే ప్రశ్నార్థకం చేశాయి. ఈ క్రమంలో పోలీసులు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు సామాన్యుల నుంచి కూడా వినిపిస్తున్నాయి.

ఆత్మహత్యే శరణ్యం



పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

పుట్లూరు: పింఛన్లు తొలగిస్తే తమకు ఆత్మహత్యే శరణ్యమని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు కనీసం తమ వైపు చూడకుండా పంపారని కన్నీటిపర్యంతమయ్యారు. దివ్యాంగులకు సీపీఎం మండల కార్యదర్శి సూరి సంఘీభావం తెలిపారు. పింఛన్లను పునరుద్ధరించకపోతే బాధితులతో కలిసి దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధి వంచితులతో చెలగాటమా?

గుంతకల్లు: విధి వంచితులతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడటం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద దివ్యాంగులతో కలిసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు ఏకైక ఆధారమైన పింఛన్‌ను నిర్దాక్షిణ్యంగా తొలగించడం దారుణమన్నారు. పింఛన్లు వెంటనే పునరుద్ధరించపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. 15 ఏళ్లుగా తీసుకుంటున్న పింఛన్లు కూడా రద్దు చేశారన్నారు. ఒక్క గుంతకల్లు నియోజకవర్గంలోనే 1,661 పింఛన్లు తొలగించి దివ్యాంగులను రోడ్డున పడేశారని విమర్శించారు. అధికారంలో లేనప్పుడు ఒకలా.. వచ్చాక మరోలా ప్రవర్తించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మున్సిపల్ ఆఫీస్ దగ్గరకు వెళ్తే ప్రభుత్వ ఆస్పత్రికి పోండి.. అక్కడేమో ఎంపీడీఓ కార్యాలయం వెళ్లండి అంటూ తిప్పించుకోవడం దారుణమన్నారు. అనంతరం ఆర్‌డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, పట్టణ, రూరల్ అధ్యక్షులు ఖలీల్, బీ.రాము, నాయకులు ఫ్లయింగ్‌మబు, అబ్దుల్‌బాసిద్, శేఖర్, రంగనాయకులు, బావన్న, బాబురావు, వంశీ యాదవ్, గోవింద్‌నాయక్, పాటిల్ జయరామిరెడ్డి, షాబుద్దీన్, రంగ, రాజశేఖర్ పాల్గొన్నారు.



దివ్యాంగులతో కలిసి ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలు సురక్షితంగా, పారదర్శకంగా సాగేలా చూడడమే లక్ష్యమని ఎస్పీ పి. జగదీష్ అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అనుమతుల కోసం ప్రత్యేకంగా ganeshustav.net వెబ్‌సైట్ ప్రారంభించామన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందాలని సూచించారు. ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం సంబంధిత పోలీస్ అధికారి మంటప స్థలాన్ని తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) జారీ చేస్తారని, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మంటపాలకు అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు.



ఎస్పీ పి. జగదీష్

- పోలీసుల సూచనలిలా... పర్యావరణ కాలుష్యం జరగకుండా మట్టి ప్రతిమలే ప్రతిష్టించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలను వాడరాదు. మంటపాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. విగ్రహ నిమజ్జనం కోసం ప్రభుత్వం గుర్తించిన ఘాట్లను మాత్రమే వినియోగించాలి.
- ప్రతి మంటపం వద్ద సీసీ కెమెరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తదితరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చినా వెంటనే పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. ప్రతి మంటపంలో కనీసం 5 నుంచి 10 మంది వలంటీర్లు విధులు నిర్వర్తించాలి. ఉత్సవ కమిటీ సభ్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలి.
- పోలీసు శాఖ సూచించిన మార్గదర్శకాలను పాటించాలి. ఊరేగింపు సమయంలో భక్తి గీతాలు, శాంతి సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలి. ఇతర మతస్తుల మనోభావాలను దెబ్బతీయకుండా సోదరభావంతో, పరస్పర గౌరవంతో ఉత్సవాలు జరగాలి. శాంతిభద్రతలను కాపాడటంలో సహకారం అందించాలి.

దంపతులపై దాడి కేసులో వడ్డీ వ్యాపారి అరెస్ట్

ధర్మవరం అర్బన్: వడ్డీ వ్యాపారం చేస్తూ దాడులు, బెదిరింపులకు దిగిన ప్రధాన నిందితుడు సాకే రాజశేఖర్ అలియాస్ యర్రగుంట రాజాను అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం వివరాలను డీఎస్పీ వెల్లడించారు. లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన సాకే రాజశేఖర్ ధర్మవరం పరిసర ప్రాంతాల్లో అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ అనుచరులతో కలిసి బెదిరించడం, దాడులు చేయించడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటివి చేస్తున్నారన్నారు. జూలై 23న శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రమణ, అతని భార్య భారతిపై ఎర్రగుంట రాజా తన అనుచరులతో దాడి చేసి రూ.7 వేల నగదు తీసుకెళ్లారన్నారు. బాధితురాలు భారతి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దరాప్తు చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పరారీలో ఉన్న రాజాను పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అరెస్టు చేశామని తెలిపారు. అతని వద్ద నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు రూ.కోటి విలువ చేసే భూసంబంధిత రిజిస్ట్రేషన్ పత్రం, రూ.10 లక్షలు విలువ చేసే రెండు ప్రామిసరీ నోట్లు, రూ.2700 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజశేఖర్‌పై ఇప్పటికే పలు మర్డర్ కేసులు, వడ్డీ వ్యాపార దాడుల కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.



వడ్డీ వ్యాపారిని అరెస్టు చూపుతున్న పోలీసులు

మూడో రోజూ కానరాని 'మార్పు'

- మహిళా ప్రజాప్రతినిధులకు ముగిసిన శిక్షణ
- చివరి రోజు ముగ్గురే హాజరు



శిక్షణకు హాజరైన మహిళా ప్రజాప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ నిర్మల్

అనంతపురం సిటీ: అనంతపురంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో మహిళా ప్రజా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు మొక్కుబడిగా ముగిశాయి. 'మార్పు ద్వారా విజేతలు–మహిళా సాధికారతతో స్వపరిపాలన సాధ్యం' అనే అంశంపై ఉమ్మడి జిల్లాలోని మహిళా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచి మొదలైన శిక్షణ తరగతులకు కనీస స్పందన లేదంటే అతిశయోక్తి కాదు. తొలి రోజు ఇద్దరు, రెండో రోజు ముగ్గురు హాజరు కాగా, చివరి రోజు కూడా కేవలం ముగ్గురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారిలో ఇద్దరు జెడ్పీటీసీ సభ్యులు కాగా, మరొకరు ఎంపీపీ ఉన్నారు. అయితే వారికి ఎటువంటి శిక్షణ ఇవ్వలేకపోయారు. ఘనత వహించిన అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ మాత్రానికి శిక్షణ తరగతులు ఎందుకు ఏర్పాటు చేశారో అర్థం కావడం లేదని వచ్చిన ప్రజాప్రతినిధులు వాపోయారు. మరో ఏడాదిలో పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై మహిళా ప్రజాప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. ఎలాంటి ఉపయోగం లేకపోగా, నిధుల దుర్వినియోగం బాగా జరుగుతోందని వాపోయారు.



- గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో నిల్వ చేసిన ఇసుక డంప్ ఇది. రోజూ ఆ ప్రాంతంలోని వేదావతి నది నుంచి ఇసుకను తవ్వేసి వ్యవసాయ క్షేత్రానికి.. అనంతరం కర్ణాటక ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక దందాను స్వయాన స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వియ్యకుండి సోదరుడే నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ వందలాది ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది. గుమ్మఘట్ట మండలంలో ఎలాంటి ఇసుక రీచ్‌లకు గనులు, భూగర్భశాఖ అనుమతులు ఇవ్వలేదు. అయినా, ఇసుకను భారీగా తవ్వేస్తూ లక్షలాది రూపాయాలు సొమ్ము చేసుకుంటుండడం గమనార్హం. ఇక్కడొక్కటే కాదు.. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గంలోనూ ఇదే తంతు. దందా నడుపుతోంది 'పచ్చ' పార్టీ నాయకులు కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

తవ్వుకునోడికి తవ్వుకున్నంత!

- ఉచితం మాటున ఇసుక దందా
- నదులను కొల్లగొడుతున్న టీడీపీ నాయకులు
- చేష్టలుడిగి చూస్తున్న అధికారులు

అనంతపురం టౌన్: ఇసుకను ఉచితంగా అందిస్తున్నామంటూ ఊదరగొడుతున్న కూటమి ప్రభుత్వం.. ఆ మాటున 'పచ్చ' నేతలకు దోచిపెడుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేస్తూ 'తమ్ముళ్లు' భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల అండతో ఎక్కడికక్కడ తవ్వేసుకుంటూ భారీగా వెనకేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇసుక దందా సాగుతున్నా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఎద్దుల బండిపై ఇసుకను తరలిస్తేనే పట్టుకుంటున్న పోలీసు, విజిలెన్సు అధికారులు... అదే పెన్నా, వేదావతి, హగరి నదుల పరివాహక ప్రాంతాల నుంచి టిప్పర్లలో తరలిపోతున్న ఇసుక కనిపించడలేదు.

అక్కడ గుంతలే సాక్ష్యం..

శింగనమల మండలం జలాలపురం గ్రామంలోని కూతలేరు వాగును స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రధాన అనుచరులు మింగేశారు. వాగులో ఎటు చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. పెద్ద ఎత్తున ఇసుక తవ్వేసి అమ్మేసుకుంటున్నా అధికార యంత్రాంగానికి ఏమాత్రం పట్టడం లేదు. ఇసుక అక్రమ తవ్వకాలను స్థానికులు అడ్డుకుంటే తప్ప వెలుగులోకి రానివ్వకుండా అధికార యంత్రాంగం పని చేస్తుండడం గమనార్హం. శింగనమల నియోజకవర్గంలో తరిమెల, యల్లనూరు గ్రామాల్లో మినహా ఎక్కడా ఇసుక రీచ్‌లకు అనుమతులు లేవు. అయినా పెన్నా, కూతలేరు నది పరివాహక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక తవ్వేస్తూ స్థానిక టీడీపీ నేతలు అమ్మేసుకుంటున్నారు. 'పచ్చ' నేతల వికృత చేష్టలకు అక్కడి గుంతలే సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి.



బెళుగుప్ప మండలం కాలువపల్లి వద్ద ట్రాక్టర్లలో ఇసుకను నింపుతున్న దృశ్యం

పెన్నాను ఊడ్చేస్తున్నారు..

ఉరవకొండ నియోజకవర్గం బెళుగుప్ప మండలం కాలువపల్లి మీదుగా వెళ్తున్న పెన్నానది పరివాహక ప్రాంతాల్లోని ఇసుకను స్థానిక టీడీపీ నేతలు ఊడ్చేశారు. పెన్నానదిలో ఎటు చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. మంత్రి అండదండలు ఉండడంతో అధికారులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఎలాంటి ఇసుక రీచ్‌ల (ఓపెన్, పట్టా)కు గనుల శాఖ అధికారులు అనుమతులు ఇవ్వలేదు. అయినా ఇసుక రవాణా మాత్రం సాగుతోంది. బెళుగుప్ప, కూడేరు మండలాలకు చెందిన టీడీపీ నేతలు రోజువారీగా పదుల ట్రాక్టర్లలో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు బెళుగుప్పకు కాలువపల్లి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇసుక అక్రమ రవాణాను రోజూ చూస్తున్నా మంత్రికి భయపడి చర్యలకు వెనకడుగు వేస్తున్నారు.

జిల్లాలో 6 రీచ్‌లకు మాత్రమే అనుమతి..

జిల్లా వ్యాప్తంగా గనుల శాఖ అధికారులు కేవలం ఆరు ఇసుక రీచ్‌లకు అనుమతి ఇచ్చారు. వాటిలో కణేకల్లు మండలం రచ్చుమర్రి గ్రామంలో ఓపెన్ రీచ్, శింగనమల మండలం తరిమెల గ్రామంలో పట్టా భూముల్లో రెండు, యల్లనూరు మండలంలో ఒకటి, పెద్దవడుగూరు మండలంలో రెండు పట్టా భూముల్లో రీచ్‌కు మాత్రమే అనుమతి ఇచ్చారు. అయితే తాడిపత్రి మండలంలోని పెన్నా పరివాహక ప్రాంతంలో, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని తిమ్మసముద్రం, కంబదూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో పెద్ద ఎత్తున ఇసుక దందాను స్థానిక ప్రజాప్రతినిధుల అండతో టీడీపీ నాయకులు సాగిస్తున్నారు.

ఫీజు చెల్లించకున్నా.. చెల్లించినట్లు

● బహిర్గతమైన ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ పూర్వ విద్యార్థుల పన్నాగం ● విచారణకు ప్రత్యేక కమిటీ



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులు ఏకంగా బ్యాంకు చలానాలు ఫోర్జరీ ఫీజు చెల్లించినట్లుగా చూపి సర్టిఫికెట్లు పొందారు. కేవలం నాలుగు వేలు ఫీజు చెల్లించి.. రూ.14 వేలు ఫీజు చెల్లించినట్లుగా చలానాలను ఫోర్జరీ చేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో ఇంకా ఎంత మంది విద్యార్థులు ఉన్నారనే అంశంపై వివరాలు నిగ్గు తేల్చడానికి ప్రొఫెసర్ల కమిటీని నియామకం చేశారు. చలానాల్లో మూడు విభాగాలుగా విభజించి ఇస్తారు. ఒకటి బ్యాంకు.. రెండోది విద్యార్థికి.. మూడోది పరీక్షల విభాగానికి పంపుతారు. విద్యార్థికి ఇచ్చిన చలానా భాగంలో ఫోర్ థౌజండ్ అనే పదాల స్థానంలో ఫోర్టీన్ అని రాసి.. 4,000 అని అంకెల రూపంలో ఉన్న స్థానానికి ముందు 1 చేర్చి 14,000గా మార్చి చలనాను కళాశాలలో సమర్పించారు. దీంతో ఫీజు మొత్తం చెల్లించినట్లుగా నిర్ధారించుకుని సర్టిఫికెట్లు అందజేశారు. ఫోర్జరీ చేసిన విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు.

బీఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్

- నేటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మేళాలు

అనంతపురం సిటీ: ప్రభుత్వ రంగ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సంస్థ కేబుల్ ఆపరేటర్ల కోసం బంపర్ ఆఫర్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా గురువారం వెల్లడించారు. రూ.400కే సరికొత్త ట్రిపుల్ ప్లే (ఎఫ్‌టీటీహెచ్) ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ ప్రవేశపెట్టినట్లు వివరించారు. 20 ఎంబీపీఎస్ వేగంతో అపరిమిత ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్, 400+ఫ్రీ చానళ్లతో పాటు అన్ని తెలుగు పే ఛానళ్లు (44 ఛానళ్లు) వీక్షించవచ్చని వెల్లడించారు. ఈ ప్లాన్‌లో తొమ్మిది ఓటీటీలు ఉన్నాయన్నారు. లోకల్ కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్‌లో టిప్‌గా నమోదు చేసుకుని ఇప్పటికే ఉన్న ఏపీఎస్ఎఫ్ఎల్ కస్టమర్లను బీఎస్ఎన్ఎల్‌కు మార్చవచ్చని పేర్కొన్నారు. కొత్త ఫైబర్ కనెక్షన్లను కూడా అందించే అవకాశముందన్నారు. ఆసక్తి ఉన్న లోకల్ కేబుల్ ఆపరేటర్లు అనంతపురం, ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం, కదిరి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రిలో తమకు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ డివిజనల్ కార్యాలయాల్లో కానీ, అనంతపురంలోని జిల్లా కార్యాలయంలో కానీ సంప్రదించవచ్చన్నారు. కేబుల్ ఆపరేటర్ల సౌకర్యార్థం శుక్రవారం నుంచి పైన తెలిపిన డివిజన్ కార్యాలయాల్లో టిప్/లోకల్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం



రేషన్ బియ్యం డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని పారిశ్రామిక వాడ సమీపంలో ఉన్న బయలు ప్రదేశంలో డంప్ చేసిన 49.6 క్వింటాళ్ల (105 బస్తాల) రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి 11 గంటల సమయంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారం రోజుల క్రితం ఇదే స్థలంలో 78.5 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మరువకనే మళ్లీ అక్కడే 105 బస్తాల బియ్యం డంప్‌ను అధికారులు గుర్తించడం గమనార్హం. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, వీఆర్వో మల్లికార్జున, పోలీసులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- వచ్చే నెల 5న ఎన్నికలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను కమిషనర్ బాలస్వామి విడుదల చేశారు. ఈ నెల 22 నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్స్ స్వీకరిస్తారు. 29న నామినేషన్ల పరిశీలన, అదే రోజు 3 గంటలకు ప్రచురణ ఉంటుంది. వచ్చే నెల 1న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజున సాయంత్రం 3 గంటలకు పోటీ అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు. వచ్చే నెల 5న నగరపాలక సంస్థలోని నూతన భవనంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల పోలింగ్, అదే రోజున మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు వెల్లడిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

పట్నం పూర్వపు ఎస్ఐ రాజశేఖర్‌పై కేసు నమోదు

గుత్తి: న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన గిరిజన మహిళను లైంగికంగా వేధించడంతో పాటు రాత్రి వేళల్లో నగ్నంగా వీడియోకాల్స్ మాట్లాడి ఉద్యోగం పోగొట్టుకున్న ముదిగుబ్బ మండలం 'పట్నం' పూర్వపు ఎస్ఐ రాజశేఖర్‌పై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ మహిళ ఎస్ఐ రాజశేఖర్‌పై ఫిర్యాదు చేయగా.. సీఐ వెంకటేశ్వర్లు సమగ్రంగా విచారించి రాజశేఖర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, లైంగిక వేధింపులతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, సమస్య పరిష్కారం కోసం పట్నం పోలీసు స్టేషన్‌కు వచ్చిన గిరిజన మహిళను ఎస్ఐ హోదాలో ఉన్న రాజశేఖర్ లైంగికంగా వేధించిన వైనంపై 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన ఎస్పీ రత్న తొలుత రాజశేఖర్‌ను వీఆర్‌కు పంపారు. అనంతరం విచారణ జరిపారు. రాజశేఖర్ లైంగిక వేధింపులు నిజమని తేలడంతో అతన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తూ రాయలసీమ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా లైంగిక వేధింపులపైనే గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గంజాయి మత్తు .. బతుకు చిత్తు!

- కదిరి మండలం కాళసముద్రంలో ఇటీవల కొందరు మైనర్లు తోటి పిల్లలపై గంజాయి మత్తులో చెప్పులు, కర్రలతో దాడి చేసి ఆ దృశ్యాలను వారే సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ సంఘటనపై ఎస్పీ వి.రత్న ఆ గ్రామాన్ని సందర్శిస్తే పోలీసుల మెతక వైఖరి కారణంగానే ఇలా జరుగుతోందంటూ ఆమెపై బాధిత కుటుంబ సభ్యులతో పాటు మరికొందరు ఆగ్రహించిన విషయం తెలిసిందే.
- ఈ ఏడాది జనవరిలో ఎన్పీ కుంట మండలంలో గంజాయి అమ్ముతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని స్వయంగా కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే.
- తాజాగా కదిరి రూరల్ పోలీసులు కొండమనాయునిపాళ్యం వద్ద వాహనంలో గంజాయి తరలిస్తున్న గంజాయి ముఠాను అదుపులోకి తీసుకొని వారి నుండి సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- యువతే లక్ష్యంగా జిల్లాలో జోరుగా విక్రయాలు
- అధికార అండతో రెచ్చిపోతున్న గంజాయి ముఠా
- ప్రయాణికుల ముసుగులో సరుకు తరలింపు



కదిరి: జిల్లాలో ఏడాదిగా గంజాయి దందా గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి ముఠా సభ్యులు విక్రయాలు సాగిస్తున్నారు. పోలీసులకు దొరక్కుండా పట్టణాలు మొదలు గ్రామాల్లో సైతం అమ్మకాలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి ముఠా సభ్యులకు కొండంత రాజకీయ అండ దొరికింది. దీంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

గుట్టు చప్పుడు కాకుండా..

కోస్తాలోని పలు ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి కూడా జిల్లాకు గంజాయి గుట్టుగా తరలి వస్తోంది. ఇందుకోసం గంజాయి ముఠా సభ్యులు కొందరు నిరుపేదలను ఎంపిక చేసుకొని వారికి కమీషన్ రూపంలో చెల్లిస్తున్నారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. ప్రయాణికుల్లాగా వీరు బస్సులు, రైళ్లలో సరుకు తీసుకొచ్చి గంజాయి ముఠాకు అప్పగిస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో గంజాయిని తీసుకొస్తున్న వారు దొరికినా సరఫరాదారులు, విక్రయదారులు మాత్రం అధికార పార్టీ నేతల అండతో తప్పించుకుంటున్నారు. గంజాయిని అరికట్టడం తమకు పెద్ద సమస్య కాదని, అసాంఘిక శక్తులకు అధికార పార్టీ నేతలు సహకరించకపోతే సంతోషిస్తామని జిల్లాకు చెందిన ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఇటీవల తలుపుల మండలంలో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన ఒక దొంగను వదిలేయమని ఒక ప్రజాప్రతినిధి ఫోన్ చేసి చెప్పిన విషయాన్ని మరో పోలీస్ అధికారి గుర్తు చేశారు.

ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే ..

హిందూపురం, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థల వద్ద విద్యార్థులకు గంజాయి అమ్ముతున్నారు. మత్తుకు అలవాటు పడ్డ కొందరు విద్యార్థులు గంజాయి కొనుక్కోవడానికి ఇంట్లో డబ్బులు ఇవ్వకపోతే ఇంట్లో వారిపై దాడులకు కూడా పాల్పడిన సంఘటనలు ఉన్నాయని కదిరికి చెందిన ఓ విద్యార్థి తెలిపారు. కొన్ని చోట్ల యువకులు బృందాలుగా ఏర్పడి డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు.

నాడీవ్యవస్థ పనితీరు మందగిస్తుంది



గంజాయి, హెరాయిన్, ఫోర్ట్‌విన్ ఇంజెక్షన్‌లు, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలను తీసుకుంటే నాడీ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. కండరాలు, నరాల బలహీనత, జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది, అసహనం, కుంగుబాటు, బరువు తగ్గిపోవడం వంటి రుగ్మతల బారిన పడతారు.

– మదన్‌కుమార్, వైద్యనిపుణులు, కదిరి

ప్రత్యేక టీములు ఏర్పాటు చేశాం

గంజాయితో పాటు ఇంకా ఇతర మాదక ద్రవ్యాల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇందుకోసం ప్రత్యేక టీములు ఏర్పాటు చేశాం. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కదలికలు, అలవాట్లపై ఓ కన్నేసి ఉంచాలి.

– వి.రత్న, ఎస్పీ, శ్రీసత్యసాయి జిల్లా

నేత్రపర్వంగా శ్రీవారి ఉంజల్ సేవ



డోలోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి ఉంజల్ సేవ గురువారం రాత్రి నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రావణ మాసం బహుళ పక్షం త్రయోదశి పుష్యమి నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో గురువారం రాత్రి భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరించి శ్రీరంగ మంటపంలో డోలోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భార్యకు అవమానం.. భర్త ఆత్మహత్య

వజ్రకరూరు: తన భార్యకు జరిగిన అవమానాన్ని తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వజ్రకరూరు మండలం తట్రకల్లు గ్రామానికి చెందిన బాలతిమ్మరాజు (40)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం సాయంత్రం కాయగూరలను ఫ్రిజ్‌లో పెట్టేందుకు భార్య పక్కింటికి వెళ్లింది. ఆ సమయంలో పక్కింటి యజమాని కురుబ నాగార్జున ఆమెను బలత్కారం చేయబోయాడు. ప్రతిఘటించి ఇంటికి చేరుకున్న భార్య జరిగిన విషయాన్ని భర్తకు తెలపడంతో బాలతిమ్మరాజు నేరుగా వెళ్లి నిలదీశాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చెలరేగి విషయం గ్రామంలో అందరికీ తెలిసిపోయింది. దీంతో గ్రామంలో పరువు పోయిందనే మనోవేదనతో తిమ్మరాజు బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక గురువారం బాల తిమ్మరాజు మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురుబ నాగార్జునతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

నానో యూరియాతో మంచి ఫలితాలు

- రైతులకు ఖర్చు కూడా తగ్గుతుంది
- ఉద్యానశాఖ డీడీ డి.ఉమాదేవి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి

అనంతపురం అగ్రికల్చర్: నానో యూరియాతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఉద్యానశాఖ డీడీ డి.ఉమాదేవి అన్నారు. 'నానో' యూరియా, డీఏపీ ఎరువుల వాడకంపై హార్టికల్చర్ ఆఫీసర్లు (హెచ్‌ఓలు), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు (వీహెచ్ఏ)కు అవగాహన కల్పించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యానశాఖ డీడీ డి.ఉమాదేవి, ఏడీ దేవానంద్ పాల్గొని నానో ఎరువుల వాడకం, ప్రయోజనాల గురించి తెలియజేశారు. మామూలు యూరియా, డీఏపీతో పోల్చితే ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా, డీఏపీ వాడకం వల్ల పంటల్లో మంచి ఫలితాలు వచ్చినట్లు పరిశోధనలు రుజువు చేశాయన్నారు. రైతులకు ఖర్చు కూడా వాటి కన్నా కాస్త తక్కువగానే ఉంటుందని తెలిపారు. మామూలు యూరియాను దిగుమతి చేసుకోవడం వల్ల ప్రభుత్వాలపై భారం పడుతోందన్నారు. ఈ క్రమంలో దేశంలోనే ఉత్పత్తి చేస్తున్న నానో యూరియా, డీఏపీ వల్ల అటు ప్రభుత్వాలకు ఇటు రైతులకు కూడా ఖర్చు తగ్గి మంచి ఫలితాలు లభిస్తాయని తెలిపారు. వివిధ పంటల్లో ఎంత మోతాదులో వాడాలి, ఎలా వాడాలనే దానిపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోరమాండల్ ప్రతినిధులు గోవిందరావు, మహబూబ్‌అలీ, వెంకటేశు, శివకుమార్, హెచ్ఓ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

గుడిబండ/రొళ్ల: ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆర్థిక భారం తగ్గించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని బెంగళూరు కృషి విశ్వవిద్యాలయ (అగ్రికల్చర్ యూనివర్సిటీ) మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. డీపీఎం లక్ష్మానాయక్‌తో కలసి గురువారం గుడిబండ మండలం జవనడుకు, చిగతుర్పి, రొళ్ల మండలం కొరగార్ల గుట్ట గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలు, నవధాన్యాల సాగును పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై విత్తన గుళికలు, బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ నవీన్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్‌కు సరిపడని యూరియా

- వచ్చిన వెంటనే ఖాళీ అవుతున్న గోదాములు



పెడపల్లి సొసైటీలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా రైతుల డిమాండ్‌కు సరిపోవడం లేదు. ఒక లోడు, అర లోడు చొప్పున పంపుతుంటే కేవలం గంటల వ్యవధిలోనే ఖాళీ అవుతోంది. జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా మొక్కజొన్న, వరి సాగు చేపట్టారు. అయితే యూరియా డిమాండ్ ఉన్న ఈ పంటల్లో ప్రభుత్వం అరకొరగా సరఫరా చేస్తుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, సొసైటీల వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు క్యూ కడుతున్నారు. గురువారం పెడపల్లి సొసైటీకి 140 బస్తాల యూరియా రాగా, రెండు గంటల వ్యవధిలోనే ఖాళీ అయిపోయింది. ఒక్కో రైతుకు రెండేసి బస్తాలు చొప్పున పంపిణీ చేసినా క్యూ లైన్‌లో వేచి ఉన్నవారిలో సగం మందికి కూడా దక్కలేదు. దీంతో చాలా మంది రైతులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. ప్రస్తుతం జిల్లాలో 4,700 టన్నుల యూరియా ఉన్నట్లుగా వ్యవసాయ శాఖ చెబుతున్నా.. ఈ మొత్తం ఏనాడో ఖాళీ అయిపోయి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వచ్చే లోడు కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేయాల్సి వస్తోందన్నారు.

డిగ్రీలో పాఠ్యాంశాలుగా 'అనంత' కవితలు

అనంతపురం ఎడ్యుకేషన్/కల్చరల్: అనంతకు చెందిన సీనియర్ కవి డాక్టర్ రాధేయ, కవయిత్రి.. ప్రస్తుతం హిందూపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి రాసిన కవితలు డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశాలు కానున్నాయి. ఈ మేరకు డిగ్రీ సిలబస్ కమిటీ చైర్మన్ సుంకర గోపాలయ్య గురువారం వివరాలనందించారు. డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ రచించిన 'మగ్గం బతుకు' అనే దీర్ఘ కవితను డిగ్రీలో స్పెషల్ తెలుగు చదువుకునే వారికి ఆరో సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా చేర్చారు. అలాగే డాక్టర్ ప్రగతి రాసిన 'బొగ్గుల పొయ్యి' కవిత బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సెమిస్టర్‌లో జనరల్ తెలుగు చదువుకునే విద్యార్థులకు సిలబస్‌గా చేర్చారు. అనంత కవుల కవితలను డిగ్రీ విద్యార్థుల పాఠ్యాంశాలుగా చేర్చడంపై సాహితీ స్రవంతి, డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ ఫౌండేషన్, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, జిరసం, అరసం, తెలుగు వెలుగు సాహితీ సంస్థల ప్రతినిధులు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వెలిబుచ్చారు.

యువకుడి హత్య



ధనుంజయ (ఫైల్)

ధర్మవరం అర్బన్: స్థానిక ఎల్పీ సర్కిల్‌లోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఓ యువకుడిని దుండగులు దారుణంగా హతమార్చారు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడిని ఎల్-3 కేతిరెడ్డి కాలనీకి చెందిన పొళ్యం ధనుంజయ(26)గా గుర్తించారు. భార్య శ్రుతి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బైక్ మెకానిక్‌గా కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ కలహాలతో భార్య గొడవ పడి కొంత కాలం క్రితం బళ్లారిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ధనుంజయ తన తల్లిదండ్రుల వద్దనే నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద వ్యాయామం చేసుకునే స్థలంలో ధనుంజయ తలపై ఓ దుండగుడు సిమెంట్ ఇటుక వేసి హతమార్చాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. హతుడి తల్లి లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గీత కులాలకు కొత్త బార్లు

- ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం: గీత కులాల అభ్యున్నతికి జిల్లా వ్యాప్తంగా కొన్ని బార్లను రిజర్వ్ చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. గీత కులాలకు సంబంధించి కొత్త బార్ పాలసీకి రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గీత కులాలకు రెండు నూతన బార్లు కేటాయించినట్లు తెలిపారు. వీటికి రూ.27.50 లక్షలు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ నిర్ణయించామన్నారు. ఒక్కొక్క బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలన్నారు. దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలుగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. బార్ కేటాయింపు కేవలం లాటరీ పద్ధతిలోనే ఉంటుందన్నారు. మొత్తం లైసెన్స్ ఫీజు ఆరు వాయిదాలలో చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29వ తేదీలోపు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 30న లాటరీ ప్రక్రియ ఉంటుందన్నారు. అనంతరం గీత కులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి గీత కులాల బార్‌ల నోటిఫికేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.రామ్మోహన్‌రెడ్డి, సీఐ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు

అనంతపురం కల్చరల్: జిల్లా గణేష్ ఉత్సవ సమితిని గురువారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర శాఖ సూచనల మేరకు జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా సీఆర్ విశ్వేశ్వరరెడ్డి ఎంపికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కుమారయ్య, శబరీష్, సురేష్ గుప్తా, వెంకటరమణ, జయప్ప, కార్యదర్శులుగా తిరుమలరెడ్డి, పవన్‌కుమార్, రాజేష్, నార్పల శివ, కుమార్, కోశాధికారిగా విశ్వనాథ్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి నాయకులు మాట్లాడుతూ రానున్న వినాయక చవితి నిర్వాహకులకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులను జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆంక్షలు ఎక్కువగా లేకుండా ఆనందోత్సాహాల నడుమ ఉత్సవం జరుపుకునేలా సహకరించాలని కోరారు.

రైతు బలవన్మరణం

అమరాపురం: మండలంలోని నగోనపల్లికి చెందిన రైతు గొల్ల కృష్ణప్ప (59) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గొల్ల కృష్ణప్పకు భార్య సవీరమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు చేశారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల క్రితం కృష్ణప్ప వెను నొప్పితో బాధపడుతున్నాడు. దావణగెర, తుమకూరు, బెంగళూరు, పావగడ, అమరాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. తరచూ నొప్పికి తాళలేక విలవిల్లాడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం తన పొలం పక్కనే ఉన్న తుగ్గలి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సవీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చిన్నారికి ప్రాణభిక్ష పెట్టండి

- సక్రమంగా పని చేయని రెండు కిడ్నీలు
- బ్లడ్ ఇన్‌ఫెక్షన్, న్యూమోనియాతో కదలలేని స్థితి
- చికిత్స కోసం రూ.10 లక్షలు అవసరం
- దాతల కోసం ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబం



బెంగళూరులోని ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న చిన్నారి అల్ఫియా

నల్లచెరువు: మండలంలోని దేవిరెడ్డిపల్లికి చెందిన ఇమాంబాషా, షబానా దంపతుల నాలుగేళ్ల వయసున్న ఏకైక కుమార్తె అల్ఫియా ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటికే రూ. లక్షలు ఖర్చు కాగా, పాప సంపూర్ణ ఆరోగ్య వంతురాలు కావడానికి అవసరమైన చికిత్స కోసం రూ.10 లక్షలు అవుతుందని అక్కడి డాక్టర్లు పేర్కొన్నారు. దీంతో నిరుపేద కుటుంబానికి దిక్కుతోచడం లేదు. ఆపన్న హస్తం అందించి తమ కుమార్తెకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.

20 రోజుల క్రితం న్యూమోనియా..

అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని గ్యాస్ ఏజెన్సీలో డెలవరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని ఇమాంబాషా పోషించుకుంటున్నాడు. జీవనం సాఫీగా సాగిపోతున్న తరుణంలో 20 రోజుల క్రితం అల్ఫియాకు జబ్బు చేసింది. తీవ్రమైన జ్వరం, దగ్గు ఎక్కువగా ఉండడంతో మదనపల్లిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పది రోజులు గడిచాయి. అయినా చిన్నారికి నయం కాకపోవడంతో మరోసారి వైద్య పరీక్షించి న్యూమోనియాతో బాధపడుతున్నట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తెలిసిన వారి వద్ద అప్పు చేసి డబ్బు సమకూర్చుకుని ఆగమేఘాలపై బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి చిన్నారిని తీసుకెళ్లారు.

సక్రమంగా పనిచేయని కిడ్నీలు

అల్ఫియాకు వైద్య పరీక్షలు నిర్వహించిన బెంగళూరులోని ఆస్పత్రి వైద్యులు.. న్యూమోనియాతో పాటు బ్లడ్ ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా ఉన్నట్లుగా గుర్తించారు. ఈ క్రమంలోనే రెండు కిడ్నీలూ సక్రమంగా పనిచేయడం లేదని నిర్ధారించారు. అల్ఫియా పరిస్థితి విషమంగా ఉండడంతో సత్వర చికిత్సలు అందించాలని పాప పూర్తిగా కోలుకోవాలంటే రూ.10 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. పిడుగు లాంటి వార్త విన్న నిరుపేద తల్లిదండ్రులకు ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో చిన్నారి వైద్య ఖర్చులు మొత్తం భరించాల్సి వస్తోంది. ఇప్పటికే తెలిసిన వారి వద్ద చేసిన రూ. 4 లక్షల వరకూ అప్పు చేసి చికిత్స చేయించారు. అయినా పాప పరిస్థితిలో మార్పు లేకపోవడంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అక్కడి ఐసీయూలో చికిత్స పొందుతున్న చిన్నారికి ప్రాణభిక్ష పెట్టే దాతలు ఎవరైనా ముందుకు రావాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

సాయం చేయదలిస్తే..

పేరు	: ఎస్.షబానా
బ్యాంకు పేరు	: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ)
ఖాతా నంబర్	: 9115 0793 384
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	: ఏపీజీబీ0001047
ఫోన్‌పే నంబర్	: 93915 74457

క్లుప్తంగా

పింఛన్లు తొలగించడం అన్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు తీరని అన్యాయం చేస్తోంది. అర్హులైన వికలాంగులను అనర్హులంటూ పింఛన్లు తొలగిస్తుండటం దారుణమని ఎంపీపీ సుబ్బర హేమలత విమర్శించారు. గురువారం ఎంపీపీ విలేకర్లతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీ, కుల, మతాలు చూడకుండా పింఛన్ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన వారి పింఛన్లు కూడా తొలగిస్తోందన్నారు. మండల వ్యాప్తంగా 291 మంది దివ్యాంగులకు పింఛన్ తొలగిస్తుండటం బాధాకరమన్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికి పింఛన్లు ఉంచి మిగిలిన వారికి తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సజావుగా వేలంపాట



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం పూజా సామగ్రి, ఇతర వస్తువులు అమ్ముకొనే హక్కు కోసం వేలం పాట నిర్వహించారు. పూజా సామగ్రికి సంబంధించి రూ.9,500 పాడినట్లు ఆలయ ఈఓ బాబు తెలియజేశారు. అలాగే హోమ సామాగ్రి సరఫరా వేలాన్ని రూ.4.55 లక్షలకు ఆదినారాయణ చౌదరి అనే వ్యక్తి దక్కించుకున్నారన్నారు. గత ఏడాది కన్నా ఈ యేడాది ఈ వేలం పాటలో రూ.1.48 లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చిందన్నారు.

పనులు చేపట్టకపోతే కార్పొరేషన్ ముట్టడిస్తాం



ధర్నా చేస్తున్న సీపీఎం నగర నాయకులు, స్థానికులు

అనంతపురం అర్బన్: తపోవనం వెళ్లే రహదారి మరమ్మతు, బ్రిడ్జి, వంకకు రక్షణ గోడ నిర్మాణం పనులు రెండు రోజుల్లో చేపట్టకపోతే కార్పొరేషన్ కార్యాలయాన్ని ఈనెల 25న ముట్టడిస్తామని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారానికి గురువారం స్థానిక తపోవనం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ రోజూ ప్రకటనలు గుప్పిస్తున్న ఎమ్మెల్యేకు అధ్వానంగా మారిన తపోవనం రహదారి, పాడైన బ్రిడ్జి, రక్షణ గోడ లేక ప్రమాదాలకు నిలయంగా మారిన నడిమివంక కనిపించలేదా అని ప్రశ్నించారు. నగర పాలకవర్గం కూడా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పనులు చేపడతామని నగర పాలక సంస్థ ఈఈ నరసింహులు హామీ ఇచ్చిన కారణంగా ఆందోళన విరమిస్తున్నామన్నారు.పనులు చేపట్టకపోతే సంస్థ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, వలి, రాజు, ఇర్ఫాన్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ఐఆర్, పీఆర్సీ ప్రకటనకు కృషి చేయాలి



ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌తో ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఐఆర్, పీఆర్సీ ప్రకటనకు కృషి చేయాలని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌కు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం అనంతపురంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్జిత సెలవుల నగదు బకాయిలు, పెండింగ్ డీఏల బకాయిల విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కొత్తగా అమలు చేస్తున్న మూల్యాంకన విధానం బోధనకు ఆటంకం మారిందని, దాన్ని రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్జీఓ సంఘం చేపట్టబోయే ప్రతి కార్యక్రమానికి ఎస్టీయూ జిల్లా సంఘం మద్దతు ఉంటుందని ప్రకటించారు. విద్యాసాగర్‌ను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు డేనియల్, నాయకులు మల్లికార్జున ఉన్నారు.

బీపీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీపీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత విడుదల చేశారు. మొత్తం 70 మందికి గాను, 60 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలకు జ్ఞానభూమి పోర్టల్‌లో చూడాలని కోరారు.

అంతా ఇష్టారాజ్యం

- నగరంలో విచ్చలవిడిగా షెడ్ల ఏర్పాటు
- బెటర్‌మెంట్ చార్జీలను ఎగ్గొట్టి నిర్మాణాలు
- నిద్రమత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు



అశోక్‌నగర్‌లో అనధికారికంగా చేపడుతున్న భారీ షెడ్డు నిర్మాణం



లక్ష్మీనగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న షెడ్లు

అనంతపురం కార్పొరేషన్: జిల్లా కేంద్రం అనంతపురం నగరం రోజు రోజుకు విస్తరిస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, చుట్టుపక్కల జిల్లాల నుంచి ఎంతో మంది ఉపాధి, విద్య తదితర అవకాశాల కోసం అనంతపురం నగరంలో స్థిరపడుతున్నారు. ఇటువంటి తరుణంలో భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లేలా జిల్లా అధికార యంత్రాంగం ఆలోచించాల్సిన అవసరం ఉంది. కానీ జిల్లా కేంద్రంలో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. నగరంలో ప్రణాళిక బద్ధంగా నిర్మాణాలు చేపట్టేలా చూడాల్సిన నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం చేతులెత్తేసింది. ఇప్పటికే వేల సంఖ్యలో భవనాల అతిక్రమణలు జరిగాయి. వీటిని పట్టించుకునే పరిస్థితే లేదు. ప్లాన్ ఒకలా తీసుకుని నిర్మాణం మరోలా చేపడుతున్నారు. దీంతో పాటు నగరంలో వ్యాపారులు షార్ట్‌కట్‌లో భారీ వ్యాపారాలకు తెరతీస్తున్నారు. షెడ్లు ఏర్పాటు చేసుకుని రూ.లక్షల నుంచి రూ.కోట్లలో వ్యాపారాలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఆదాయానికి గండి:

వాస్తవంగా నగరంలో ఎక్కడైనా నిర్మాణం చేపట్టాలంటే టౌన్ ప్లానింగ్ అనుమతులు తప్పనిసరి. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపడితే వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌తో పాటు బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించాలి. కానీ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ మాత్రం తూతూమంత్రంగా కట్టించి భారీ సెట్టింగ్‌లు వేసుకునేలా అనుమతులిస్తున్నారు. అందుకు నిర్మాణదారులు అధికారులను 'మంచిగానే' చూసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. షెడ్లు ఏర్పాటు చేసుకుని బెటర్‌మెంట్ చార్జీలను చెల్లించడం లేదు. నగరంలోని సాయినగర్, అశోక్‌నగర్, రామ్‌నగర్, రామ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, శ్రీనగర్ కాలనీ, లక్ష్మీనగర్, గుత్తి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, తదితర ప్రాంతాల్లో భారీగా షెడ్లు ఏర్పాటు చేసి అందులో హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, ఎలక్ట్రిక్ వాహనాల వ్యాపారం జరుగుతోంది.

నీకు..నాకు:

కూటమి ప్రభుత్వంలో వివిధ డివిజన్లలో వీధికో చోటా నాయకుడు తయారవుతున్నాడు. నిర్మాణం జరిగే చోటకు వెళ్లడం.. 'అనుమతులు మేమే ఇప్పిస్తాం.. అన్న వద్దకు రండి' అంటూ ప్రజాప్రతినిధి వద్దకు తీసుకెళ్తూ బేరసారాలు చేస్తున్నారు. 'తెలుగు తమ్ముళ్లు', టౌన్ ప్లానింగ్ సిబ్బంది తోడై నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. 'నీకు..నాకు' అన్న చందంగా ప్రజాప్రతినిధి, టౌన్ ప్లానింగ్ అధికారులు కలసిపోయారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రాథమిక నిబంధనలైనా పాటించేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు



మాట్లాడుతున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మహిళా హాస్టళ్లలో గురువారం యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేస్తే క్రిమినల్ చర్యలతో పాటు ఉద్యోగాలు రాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ర్యాగింగ్ చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం: ఉద్యోగం చేయడం కంటే.. ఉద్యోగాలిచ్చే స్థాయికి ప్రతి ఒక్కరూ ఎదగాలని జేఎన్టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అలవరచుకోవాలని సూచించారు. సొంతంగా స్టార్టప్స్ నెలకొల్పే విధంగా ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ ఎం. రమేష్ నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన మూల్యాంకనాన్ని రద్దు చేయాలి

- వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్



డీఈఓ ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న నూతన మూల్యాంకన విధానాన్ని విద్యాశాఖ ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ముందుగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ జిల్లా విద్యాశాఖ అధికారిగా అవార్డు అందుకున్న డీఈఓను సన్మానించారు. అనంతరం ఆయనకు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ... నూతన మూల్యాంకన విధానంతో బోధనా సమయం వృథా అవుతోందన్నారు. ఫలితంగా విద్యార్థులు నష్టపోతారని వాపోయారు. ఈ నష్టాలను గుర్తించి ఈ విధానాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశక్తి పథకాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో వైఎస్సార్ టీఏ రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకటరమణప్ప, గోపాల్, రామకృష్ణ, కృష్ణానాయక్, సిద్ధప్రసాద్, విశ్వనాథరెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

ఉచిత బస్సుతో ఉపాధి దూరం

- ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

అనంతపురం అర్బన్: మహిళలకు ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు తక్షణం వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసిందన్నారు. అదే విధంగా ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామన్న హామీనీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన ఆటో కార్మికులతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ఉప ప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్, నాయకులు రమేష్, నాగరాజు, హస్మత్‌బీ, సురేష్, నరేంద్ర, రఘు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


- కలెక్టరేట్ ఎదుట ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

అనంతపురం అర్బన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ముర్తుజ, అధ్యక్ష, కార్యదర్శులు నల్లమ్మ, నాగలక్ష్మి, సీఐటీయూ జిల్లా కోశాధికారి గోపాల్ మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము కట్ చేసినా కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదని, రక్షణ పరికరాలు ఇవ్వడం లేదన్నారు. జీఓ 549 ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.16 వేలు ఇవ్వాలన్నారు. కార్మికుల తక్కువగా ఉండడంతో ఉన్నవారిపై పనిభారం పెరిగినందున కొత్తగా కార్మికులకు నియమించాలన్నారు. పురుషుల వార్డులో పురుష కార్మికులను, మహిళల వార్డులో మహిళ కార్మికులకు విధులు కేటాయంచాలన్నారు. కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, బకాయిగా ఉన్న రెండు నెలల వేతనం తక్షణం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కళావతి, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే !



పంపనూరు వద్ద హంద్రీ-నీవా కాలువలో వేగంగా ప్రవహిస్తున్న నీరు

ఆత్మకూరు: ప్రస్తుతం హంద్రీ-నీవా కాలువకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు వదిలారు. గతంలో కాలువకు ఇరు వైపులా, కాలువకు కింద భాగంలో మట్టి ఉండటంతో ఎలాంటి ప్రమాదం ఉండేది కాదు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కుప్పంకు నీరు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులు చేపట్టింది. బెళుగుప్ప మండలం నుంచి ఆత్మకూరు మండలం వరకు హంద్రీ-నీవా కాలువకు సంబంధించి లైనింగ్ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. దీంతో ప్రస్తుతం కాలువలో నీరు వేగంగా ప్రవహిస్తోంది. ఎవరైనా కాలు జారి పడితే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. పొరపాటున హంద్రీ-నీవా కాలువలో పడితే కనీసం గట్టు దగ్గర పట్టుకునేందుకు కూడా ఎలాంటి అవకాశం లేదు. ప్రస్తుతం వినాయక చవితి వస్తోంది. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని, పిల్లల్ని కాలువల దగ్గరకి, బావుల దగ్గరకి వెళ్లనివ్వకుండా చూడాలని అధికారులు సూచిస్తున్నారు.

కృష్ణం వందే జగద్గురుం



అనంతపురంలో శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహం ఊరేగింపు



చెన్నేకొత్తపల్లిలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఐదు రోజులుగా సాగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. కృష్ణాష్టమి రోజున అరవిందనగర్‌లో ఏర్పాటు చేసిన కృష్ణుడికి నిత్య పూజలు నిర్వహిస్తూ నగర వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. కృష్ణం వందే జగద్గురుం అంటూ జ్ఞానవేదిక సభ్యులు శ్రీకృష్ణుడి నామస్మరణతో పరిసరాలను ప్రతిధ్వనింపజేశారు. విద్యుత్‌నగర్ సర్కిల్, హౌసింగ్ బోర్డు పార్కు వీధుల మీదుగా అంగరంగ వైభవంగా ఊరేగింపు సాగింది. భక్తులందరూ తమ భుజాలపై మోస్తూ చిన్ని కృష్ణుడిని ప్రజలకు దర్శనం చేయించారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, దండోరా నాయకులు చిన్న పెద్దన్న తదితరులు కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు అర్లే మల్లికార్జున మాట్లాడుతూ భగవంతుడే మనిషిగా అవతరించిన పవిత్ర భూమిపై నివసించే అందరూ సాటివారి అభ్యున్నతికి తోడ్పడాలనే శ్రీకృష్ణ సందేశాన్ని వినిపిస్తున్నామన్నారు. పవిత్ర భగవద్గీత ప్రచారమే లక్ష్యంగా సంస్థ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, టీసీ నాగేంద్ర, రాఘవ, ఇందిర, గురుస్వామి, వెంకటరాముడు, శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

చెన్నేకొత్తపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పూల పల్లకీలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

క్వాంటం టెక్నాలజీపై అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న దృశ్యం

అనంతపురం: క్వాంటం టెక్నాలజీని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అమలు చేయడానికి వీలుగా క్విన్పోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి, ఎస్కేయూకి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా పరిశోధన, అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, ఆవిష్కరణలకు సహకారం, పరిశ్రమ -సంబంధిత పాఠ్యక్రమ అభివృద్ధి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.అవగాహన ఒప్పందంపై గురువారం రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, క్విన్పోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ, డాక్టర్ వల్లూరి మహేశ్వరరావు సంతకాలు చేశారు. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత సమక్షంలో అవగాహన ఒప్పందం జరిగింది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ షాపులో అగ్నిప్రమాదం

అనంతపురం: బళ్లారి బైపాస్ రోడ్డులో ఉన్న ఆర్‌ఆర్ ఆర్ ఆటోమొబైల్ షాపులో గురువారం షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం సంభవించింది. షాపులో సామాన్లన్నీ కాలి బూడిదయ్యాయి. రూ. లక్షల్లోనే ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమికంగా అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ఈ షాపు పక్కనే ఉన్న మరో మూడు షాపులకు మంటలు ఎగిసి పడడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు.

నీరు నిల్వ లేకుండా చూడండి



నీటి తొట్టెను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని ఎన్‌ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది గురువారం న్యామద్దెల పంచాయతీ పరిధిలోని హరియాన్‌చెరువు ప్రాంతంలో పర్యటించారు. ఇళ్ల వద్ద నీటితొట్టెల్లో నిల్వ చేసిన నీటిని పరిశీలించారు. దోమల లార్వా ఉన్న నీటిని పారబోశారు. డెంగీ, మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రూన్సీ, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రెడ్డి, ఆశావర్కర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలకు నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్: వృద్ధాప్యంలో ప్రశాంతంగా జీవించడానికి మార్గాలను వెతుక్కోవాలని సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ట్రస్టు సభ్యులు వివిధ వృద్ధాశ్రమాలకు డైనింగ్ టేబుళ్లు, కుర్చీలతో పాటు నిత్యావసర వస్తువులనందించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో ఉంచకుండా బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. మానవతామూర్తులే లేకుంటే వయసు మీరిన వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే విచారంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, విజయభాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

సెక్టోరియల్ పోస్టుల భర్తీలో నిబంధనలు పాటించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష పరిధిలోని సెక్టోరియల్ పోస్టుల భర్తీలో నిబంధనలన్నీ పాటించాలని రిజర్వేషన్ సాధికార పరిరక్షణ సమితి అధ్యక్షులు జీవీ ఉజ్వల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జీఓ-2,10 మేరకే సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ మూడు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. జిల్లా అధికారులు ఈ నిబంధనలు పాటించేలా చూడాలని కోరారు.

వివాహిత అదృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...పుచ్చగింజల భాస్కర్‌కు ఉరవకొండకు చెందిన వరలక్ష్మికి మూడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ప్రస్తుతం ఒక పాప సంతానం. ఎలక్ట్రీషియన్‌గా పని చేసే భాస్కర్ సోములదొడ్డిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. బుధవారం జాతరకని తల్లిదండ్రులతో పాటు భాస్కర్ కూడా వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి భార్య పుచ్చగింజల వరలక్ష్మి కనిపించలేదు. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద ఆరా తీశారు. అయినా ఆచూకీ లేకపోవడంతో గురువారం అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా కొండారెడ్డి



కనగానపల్లి సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఈ కొండారెడ్డి

కనగానపల్లి: మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా కొండారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్లుగా రెగ్యులర్ ఏఈ లేక మండలంలోని రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధర్మవరంలో పనిచేస్తున్న ఏఈ కొండారెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. కనగానపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పలువురు విద్యుత్‌శాఖ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

24న ద్విదశాబ్ది పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: 'స్పందన' అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న ద్విదశాబ్ది పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని సంస్థ ప్రతినిధి చం.శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల కామర్స్ హాలులో జరిగే సాహితీ కార్యక్రమానికి సాహితీ అభిమానులు విచ్చేయాలని కోరారు.

24న మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

అనంతపురం కల్చరల్: నగరంలోని సీతారామాంజనేయ దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 24న ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరుగుతుందని ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము తెలిపారు. మట్టి వినాయక ప్రతిమలు కావాల్సిన వారు ముందుగా టోకెన్లు తీసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం: టూటౌన్ పోలీసులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. గురువారం నగరంలో అరవింద నగర్‌లోని స్పైస్ హోటల్ దగ్గర ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి కర్ణాటకకు చెందిన 24 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.